# విశాఖలో వైద్య పరికరాల పార్కు

- నడుపూరులో 204 ఎకరాలు కేటాయింపు
- మరో 66 ఎకరాలకు సిఫారసు
- రూ.275 కోట్ల వ్యయం
- 500 పరిశ్రమలకు అవకాశం
- త్వరలో కార్యకలాపాలు

(ఆంధ్రజ్యోతి/ విశాఖపట్నం): అధునాతన ఆసుపత్రి ఏర్పాటు చేయాలంటే భూమి కొనుగోలుకు, భవన నిర్మాణానికి ఎంత వ్యయం చేయాల్సి వస్తుందో వైద్య పరికరాల దిగుమతికీ అంతే వెచ్చించాల్సి వస్తోంది. దేశంలో వైద్యులందరూ అవసరమైన పరికరాలన్నింటినీ విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నారు. ఏటా 24 వేల కోట్ల విలువైన వైద్య పరికరాలు దిగుమతి అవుతున్నాయి. వీటిపై 10 నుంచి 24 శాతం దిగుమతి సుంకం అదనంగా చెల్లించాల్సి వస్తోంది. వైద్యరంగం ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులను తొలగించడానికి కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో వైద్య పరికరాల తయారీ పార్కు ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం 270 ఎకరాలు అవసరం కాగా ఇప్పటికే జిల్లా యంత్రాంగం నడుపూరులో 204 ఎకరాలను కేటాయించింది. ఇంకో 66 ఎకరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ పార్కు నిర్మాణానికి భారత వైద్య పరికరాల తయారీ అసోసియేషన్ సహకారం అందిస్తుండగా ఏపీ మెడ్‌టెక్ జోన్ బాధ్యతలు తీసుకుంది. ఈ పార్కు నిర్మాణానికి రూ.275 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేస్తుండగా ఇందులో రూ.225 కోట్లు కేంద్రం సమకూరుస్తుందని, మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్ర సర్కారు ఇప్పటికే రూ.25 కోట్లను వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేసింది. వీలైతే ఆగస్టులో సీఎం చంద్రబాబుతో పనులకు శంకుస్థాపన చేయించాలని భావిస్తున్నారు. అయితే అంతవరకు ఆగకుండా వెంటనే కార్యకలాపాలు ప్రారంభించాలని ఏపీ మెడ్‌టెక్ జోన్ భావించగా, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య ఇటీవల విశాఖపట్నం వచ్చి పలు సంస్థలను సందర్శించారు. రుషికొండ ఐటీ పార్కులోని సింబియోసిస్ టెక్నాలజీస్ సీఈవో నరేశ్‌కుమార్ తమ దగ్గర ప్లగ్ అండ్ ప్లే సౌకర్యంతో ఆఫీస్ స్థలాన్ని ఉచితంగా ఇస్తామని ముందుకు వచ్చారు. దాంతో వెంటనే ఆఫీసును ప్రారంభించేశారు.



నడుపూరులో కేటాయించిన స్థలం వద్ద అధికారుల బృందం (ఫైల్)

**నెలాఖరుకు నివేదిక..**

ఆసియాలో తొలి భారీ వైద్యపరికరాల పార్కు అయినందున దీనికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ బాధ్యతను కేపీఎంజీ అనే సంస్థకు అప్పగించారు. ఈ నెలాఖరుకు నివేదిక వస్తుందని, ఆ తరువాత పనులు ప్రారంభించి, ఏడాదిలోగా మౌలిక వసతులు సమకూర్చాలనే యోచనలో ఉన్నామని అధికార వర్గాలు తెలిపాయి.

**500 పరిశ్రమలకు అవకాశం..**

ఈ పార్కులో 500 పరిశ్రమలకు అవకాశం కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వైద్య పరికరాల తయారీతో పాటు వాటిని ఇతర దేశాలకు ఎగుమతి చేసేలా ఇక్కడివారిని ప్రోత్సహిస్తారు. ఇందుకోసం సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి పెద్ద మందిరాలు, ఉత్పత్తుల ప్రదర్శనలకు షోరూమ్‌లు, పరిశోధనలకు లేబొరేటరీలు ఇత్యాది ఆధునిక సౌకర్యాలన్నీ కల్పిస్తున్నారు. ఈ పార్కుకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చే బాధ్యతను విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (ఉడా)కు అప్పగించామని విశాఖ కలెక్టర్ యువరాజ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.


ఆంధ్రజ్యోతి Fri, 08 July 2016
epaper.andhrajyothy.com/c/11552713